ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 13 అక్టోబరు 2025 | 5



నది ఒడ్డున విరిగిన సిమెంట్ రోడ్డు అంచు

- పడవపై పడి నీట మునిగిన వైనం
- ఈదుకుంటూ పైకి వచ్చిన రైతులు

ముమ్మిడివరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): లంకల్లో వ్యవసాయ పనులు చేసుకునే రైతులు ఆదివారం మధ్యాహ్నం భోజనానికి పడవలో తిరిగి వస్తుండగా నదిఒడ్డున సిమెంట్‌రోడ్డు అంచు విరిగిపడింది. దీంతో ఆ పడవ నీట మునిగింది. అందులోఉన్న రైతులు గోదావరిలోకి దూకి ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డారు. లంకాఫ్ ఠాణేలంకకు చెందిన రైతులు గోదావరి మధ్యన ఉన్న లంకభూముల్లో వ్యవసాయ పనులు, పశువులకోసం పడవపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం పది మంది రైతులు వ్యవసాయ పనులకు గోదావరి మధ్యనున్న లంక భూముల్లోకి వెళ్లి తిరిగి వస్తున్నారు. దీంతో లంకాఫ్ ఠాణేలంకలో పడవదిగుతుండగా గోదావరి ఒడ్డున సిమెంటు రోడ్డు విరిగి పడవ మీద పడడంతో రైతులు గోదావరిలోకి దూకి ఈదుకుంటూ బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. పడవ పూర్తిగా నీట మునిగింది. రైతులు సమయస్ఫూర్తితో గోదావరిలోకి దూకడంతో పెనుప్రమాదం తప్పింది.



ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలో నది ఒడ్డున విరిగిపడిన రోడ్డు అంచు

గోవిందా హరి గోవిందా!

గోవిందా హరి గోవిందా.. గోకులనందన గోవిందా అంటూ కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం బ్రహ్మాండంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీవారు కోదండరామ అలంకృతుడై హనుమద్‌వాహనంపై తిరువీధుల్లో విహరించారు. అశేష భక్తజనం వాహన సేవలో పాల్గొని తన్మయత్వం పొందారు.

7



బాధితుల ఫైర్!

పరిహారానికి డిమాండ్

- రాయవరంలో ప్రమాదం
- 10కి చేరిన మృతుల సంఖ్య
- నేటికీ బాధితులకు అందని సాయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలో ఈ నెల 8న జరిగిన బాణసంచా భారీ విస్ఫోటనంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. నాటి ఘటనలో సంఘటనా స్థలంలో ఆరుగురు సజీవ దహనమయ్యారు. నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక్కొక్కరిగా మృత్యువాత పడ్డారు. దీంతో ఆదివారం నాటికి బాణసంచా మృతుల సంఖ్య పదికి చేరింది. మొత్తం మృతుల్లో ఒకరు ఒడిశా ప్రాంతానికి చెందినవారు కాగా మరొకరు శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు ఉన్నారు.మిగిలిన 8 మందిలో అనపర్తి, పెదపూడి, రాయవరం ప్రాంతాలకు చెందిన మహిళా కూలీలు ఉన్నారు. దినసరి కార్మికులుగా పనిచేస్తూ జీవనం గడుపుకుంటున్నారు. వీరికి అటు ప్రభుత్వం తరపున గానీ, ఇటు ఫైర్‌వర్క్స్ యాజమాన్యం తరపున గానీ ఎటువంటి సహాయం అందలేదు. యాజమాన్య సంస్థ కార్మికుల పేరిట బీమా వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో మృతుల కుటుంబాలవారు బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వ పరంగా తమ కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లతో పాటు ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వెళ్లినప్పుడు తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ వేడుకోలు చేసుకున్నారు. ప్రభుత్వం రాయవరం ఘటనపై విచారణ కమిటీని నియమించిందని...ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ప్రభుత్వం ప్రకటిస్తుందనే సమాచారాన్ని ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబీకులకు చెబుతున్నారు. పది మంది కుటుంబీకులకు ప్రభుత్వం నుంచి తక్షణసాయం అందించి ఆదుకోవాలంటూ ఇప్పటికే ప్రజాసంఘాలు వారి పక్షాన నిలబడి ఆందోళన చేపట్టాయి. ఇదే డిమాండ్‌ను స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి బాధిత కుటుంబీకులు తీసుకువెళ్లారు. తమకు న్యాయం చేయాలని బాధితులంతా ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కోరుతున్నారు.



రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కొత్త టీచర్లు(ఫైల్)

గురువులు.. కొత్త కొలువులు!

- నేటి నుంచి స్కూళ్లకు కొత్త మాస్టార్లు
- మెగా డీఎస్సీ-2025 ద్వారా ఎంపిక
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఖాళీల భర్తీ
- మాట నిలుపుకున్న కూటమి సర్కారు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అంతా అనుకున్నట్టే జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని విజయవంతంగా పూర్తి చేసింది. కొత్త ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేయడంతో పాటు పోస్టింగ్ ఉత్తర్వులూ అందించింది.దీంతో నూతనోపాధ్యాయులు సోమవారం నుంచి బడిబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. పాఠాలు చెప్పే పనిలో బిజీబిజీగా అవనున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం జనవరిలో మరో డీఎస్సీ నిర్వహణకు సిద్ధమవుతోంది.మరో మూడు వేల పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తోంది.

1693 పోస్టులు భర్తీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మెగా డీఎస్సీ-2025కు ఈ సారి భారీగా దరఖాస్తులొచ్చాయి..అన్ని మేనేజ్‌మెంట్లు కలిపి 1,241 పోస్టులకు 63,004 దరఖాస్తులు వచ్చాయి. 38,617 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఎస్జీటీ 423, స్కూల్ అసిస్టెంట్ 818 ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ విభాగంలో ఎస్‌ఏ (పీఎస్) 3, ఎస్‌ఏ (బీఎస్) 4, ఎస్‌ఏ(పీఈ) 1, ఎస్జీటీ 104 ఖాళీగా ఉన్నాయి. జోన్-2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్/బీసీ వెల్ఫేర్/ట్రైబల్(గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీటీ 24 పోస్టులు భర్తీ చేసేలా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.ఈ పోస్టులన్నింటికీ ఈ ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇచ్చింది.జూన్, జూలై నెలలో మెగా డీఎస్సీ పరీక్ష నిర్వహించారు.ఆగస్టులో కీ, ఫైనల్ ఫలితాలు వెల్లడయ్యాయి. ధ్రువపత్రాల పరిశీలన ఆగస్టు 28 నుంచి ఏడు దశల్లో జరిగింది. ఉద్యోగ నియామక పత్రాలను సెప్టెంబరు 25న అమరావతిలో అందజేశారు. అక్టోబరు మూడు నుంచి పదో తేదీ వరకు పలు కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. వృత్తిలో పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాలు వివరించారు. విద్యాశాఖ విధివిధానాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

టీచర్ల కొరత తీరింది..

కూటమి ప్రభుత్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల కొరత తీర్చింది. మెగా డీఎస్సీ-2025 ద్వారా ఖాళీలను భర్తీ చేసింది. ఎంపికైన కొత్త గురువులు ఇప్పటికే ఎనిమిది రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రకటించారు.వారికి కావాల్సిన స్థానాన్ని ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. శనివారం నూతనోపాధ్యాయులు ఎంచుకున్న స్థానాలను కేటాయిస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. పోస్టింగ్ ఉత్తర్వులు ఈ నెల 11వ తేదీన అభ్యర్థుల మొబైల్‌లోని లీప్ యాప్‌కు పంపారు. అందులో నుంచి దాన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులు అందరూ విద్యాశాఖాధికారులు సూచించిన అన్ని రకాల విద్యార్హతలు,కులం, ఆధార్, పాన్ కార్డు తదితర వాటిని తీసుకుని వారికి పోస్టింగ్ ఉత్తర్వుల్లో పేర్కొన్న పాఠశాలలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారులు సూచించారు.కొత్తకొలువులో చేరేందుకు నూతన ఉపాధ్యాయులు సమాయత్తమవుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో మెగా డీఎస్సీ ద్వారా భారీగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారమే వేలాదిగా పోస్టులను భర్తీ చేసింది. ఉపాధ్యాయ వృత్తిలో తమను భాగస్వాములుగా చేసి ందని 'కొత్త టీచర్లు' హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీఎన్జీవో జిల్లా అడహక్ కమిటీ చైర్మన్‌గా మాధవరపు ఎన్నిక



మాధవరపు వెంకటేశ్వర్లు

అమలాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీవో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడహక్ నూతన కమిటీ ఏర్పడింది. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అడహక్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, పలువురు ఎన్జీవో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల సమక్షంలో కోనసీమజిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ అడహక్ కమిటీ నూతన చైర్మన్‌గా అమలాపురంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యూటీ పారామెడికల్‌ఆఫీసర్‌గా పనిచేస్తున్న మాధవరపు వెంకటేశ్వర్లును ఏకగ్రీవం గా ఎన్నుకున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర పారామెడికల్ అసోసియేషన్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇక కన్వీనర్‌గా వాటర్ రిసోర్స్ డెవలెప్మెంట్ డిపార్టుమెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుత్తుల వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేష్‌సింగ్ ఫైనాన్స్ అసిస్టెంట్‌గా, ఇ.ఏసుబాబును కోచైర్మన్, వి.రవి, సీహెచ్ చిట్టిబాబు, రూతమ్మలను సభ్యులుగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆరు యూనిట్ల ఎలక్షన్‌ను పటిష్టంగా నిర్వహించేందుకు ఈ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రాయవరం బాణసంచా పేలుడు ఘటనలో మరో ఇద్దరి మృతి

- తమ కుటుంబాలకు న్యాయం చేయాలంటూ అనపర్తిలో బంధువుల ఆందోళన

7

అమరావతి ఏసీ బస్సు టికెట్ రేట్లలో 10శాతం రాయితీ

- జిల్లా ప్రజారవాణాధికారి

అమలాపురం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీబస్సు డిపోనుంచి హైదరాబాద్ నడుపుతున్న అమరావతి ఏసీ బస్సు టికెట్ రేట్లలో 10శాతం రాయితీ ప్రకటించారు. ఈ అవకాశం ఈనెల 31వతేదీ వరకు అమలులో ఉంటుందని జిల్లాప్రజారవాణాధికారి ఎస్టీపీ రాఘవ్‌కుమార్ తెలిపారు. అమలాపురం నుంచి ఎంజీబీఎస్‌కు అసలు టిక్కెట్ ధర రూ.1370 కాగా 10శాతం రాయితీతో రూ.1250కు, అమలాపురంనుంచి హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్‌కు టికెట్ ధర రూ.1450 కాగా 10శాతం రాయితీతో రూ.1300కు ఏసీ బస్సులో ప్రయాణం చేయవచ్చునన్నారు. ఈ సర్వీసులు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు నాన్‌స్టాప్ సర్వీస్‌గా నడుస్తాయన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాఘవ్‌కుమార్ కోరారు.

17 నుంచి.. సత్యదీక్షలు ప్రారంభం

- ఉచితంగా దీక్షావస్త్రాలు, దీక్షామాలల అందజేత

అన్నవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి అత్యంత ప్రీతికరమైన సత్యదీక్షలు స్వీకరించే భక్తులకు ఆదివారం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు. ఈనెల 17 నుంచి సత్యదీక్షలు ప్రారంభంకానున్నాయి.దీక్షాపరులు ఈనెల 17న, 18రోజుల దీక్షలు స్వీకరించే దీక్షాపరులు ఈనెల 26న, 9రోజులు దీక్షలు ఆచరించే భక్తులు నవంబరు 4న దీక్షలు తీసుకోవాల్సిఉంటుంది. సత్యదీక్షలు మూడుసార్లలో ఎప్పుడు తీసుకున్నా నవంబరు 13న ఇరుముడు సమర్పించి విరమించాల్సి ఉంటుంది. మొత్తం 1500 మందికి దీక్షావస్త్రాలు, దీక్షామాలలు అందజేస్తున్నట్టు ఈవో తెలిపారు. వీటిలో గిరిజన ప్రాంతదీక్షాపరులకు 800, మైదానప్రాంత దీక్షాపరులకు 700మందికి అందజేస్తామని అధికారులు తెలిపారు.



అభివృద్ధి చేయనున్న గొల్లప్రోలు పరిధిలోని ప్రధాన రహదారి

నిధుల.. దారులు!

ఉమ్మడి జిల్లాలో రోడ్లకు రూ 88.25 కోట్లు నిధులు

- మూడో విడత ఇచ్చేశారు
- ఇప్పటికే రూ.96 కోట్లు విడుదల
- రెండు విడతలుగా కేటాయింపు
- టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- ఆర్‌అండ్‌బీ శాఖ కసరత్తు
- గుంతల్లేని రహదారులే లక్ష్యం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

రహదారుల అభివృద్ధికి నిధులు పుష్కలంగా విడుదలవుతున్నాయి. గుంతల్లేని రోడ్లు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఇప్పటికే రెండు విడతల్లో నిధులు లభించగా, ఇప్పుడు మరో విడత నిధులను కేటాయించారు. టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయిస్తోంది.ఇప్పటికే రహదారులకు మరమ్మతులు నిర్వహించడంతో పాటు అభివృద్ధి చేశారు.

టెండర్ల ప్రక్రియలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉన్న రాష్ట్ర, జిల్లా రహదారులు అభివృద్ధికి పలు విడతలుగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో కేటాయించిన నిధులతో కొన్ని ప్రధాన రోడ్లకు అభివృద్ధి చేశారు. తదనంతరం రెండు విడతలుగా రహదారుల అభివృద్ధికి రూ.96 కోట్లు విడుదల చేశారు. ఈ పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇందులో కొన్నింటికి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా మరికొన్ని పరిశీలన దశలో ఉన్నాయి. వీటిని వర్షాలు తగ్గగానే చేపట్టి మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు.

మరో విడత నిధులు

రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. 108 రాష్ట్ర రహదారులు అభివృద్ధికి రూ.400కోట్లు, 166 ప్రధాన జిల్లా రహదారులకు రూ.600 కోట్లు విడుదల చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న 25 రాష్ట్ర, జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.88.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.కాకినాడ జిల్లాలో 9 రోడ్లు అభివృద్ధికి రూ.35.25 కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 10 రోడ్లకు రూ30.15 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఆరు రహదారుల అభివృద్ధికి రూ.22.85 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పనులు చేపట్టేందుకుగాను టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కాకినాడ జిల్లాకు ఇలా..

రాష్ట్ర రహదారుల్లో కాకినాడ జిల్లాలోని కాకినాడ-పైన రహదారి అభివృద్ధికి రూ.5 కోట్లు, నరసరావుపేట-కాట్రావులపల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, తుని-కత్తిపూడి మధ్య అత్యంత అధ్వానంగా ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ. 3.50 కోట్లు కేటాయించగా ప్రధాన జిల్లా రహదారుల్లో ఎర్రకోనేరు-వేమవరం రోడ్డుకు రూ.3.75 కోట్లు, మర్లావ-తిరుపతి-చంద్రమాంపల్లి రోడ్డు, కట్టమూరు-జె.తిమ్మాపురం రోడ్లు అభివృద్ధికి రూ.3.60 కోట్లు,తాళ్లూరు ఎన్‌హెచ్16-యల్లమిల్లి రోడ్డుకు రూ.2 కోట్లు, సర్పవరం జంక్షన్-లైట్‌హౌస్ రోడ్డుకు రూ2.80 కోట్లు, అమీనాబాద్-యు.కొత్తపల్లి రోడ్డుకు రూ.4.20 కోట్లు, ఉండూరు బ్రిడ్జి-చేదువాడ-మంజేరు-పటవల రోడ్డుకు రూ.4.50 కోట్లు,గొల్లప్రోలు పట్టణం, చేబ్రోలు గ్రామాల పరిధిలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.3.90కోట్లు కేటాయించారు.

కోనసీమ జిల్లాలో..

రాష్ట్ర రహదారుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సిరిపల్లి-మునిపల్లి రోడ్డు అభి వృద్ధికి రూ.3.50 కోట్లు, రాజవరం-పొదలాడ రోడ్డుకు రూ.3.90 కోట్లు, మండపేట-దుళ్ల రోడ్డుకు రూ.3.50 కోట్లు,సోమేశ్వరం-రాజానగరం రోడ్డుకు రూ.3.50కోట్లు, శివకోడు-మానేపల్లి రోడ్డుకు రూ.2.10 కోట్లు, ఇదే రోడ్డుకు మరో రూ.2.20 కోట్లు విడుదల చేశారు. ప్రధాన జిల్లా రహదారుల్లో విశ్వేశ్వరపురం-దిండి రోడ్డు, గూడపల్లి-గుబ్బలపాలెం-అడవిపాలెం-కేశనపల్లి రోడ్డు, మామిడికుదురు-అప్పనపల్లి-పాతపట్నం లంక రోడ్ల అభివృద్ధికి రూ.4.8 కోట్లు,మురమళ్ల-ఐ.పోలవరం-ఎదుర్లంక రోడ్డుకు రూ.60 లక్షలు, ముమ్మిడివరం- ఐనాపురం-కాట్రేనికోన రోడ్డుకు రూ.3.9 కోట్లు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రోడ్డుకు రూ.2.15కోట్లు మంజూరయ్యాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం-బొమ్మూరు-కేశవరం రోడ్డు అభివృద్ధికి రూ.3.50కోట్లకు మంజూరు చేశారు. జిల్లా రహదారుల్లో కడియం-జేగురుపాడు, కడియపులంక-పొట్టిలంక-వీరవరం రోడ్లు అభివృద్ధికి రూ.3.20 కోట్లు, కానూరు-గోపవరం, ఎన్‌హెచ్16వీవీ రోడ్డు-ఖండవిల్లి రహదారుల అభివృద్ధికి రూ.4.15 కోట్లు, దువ్వ-తేతలి మునిపల్లె రోడ్డుకు రూ4.15 కోట్లు, గోపాలపురం-కాటకోటేశ్వరం రోడ్డుకు రూ.4.35 కోట్లు, ఎన్‌హై రోడ్డు-కురుకురు-పల్లంట్ల-లక్ష్మీపురం-ఈజీకే రోడ్డుకు రూ.3.50 కోట్లు కేటాయించారు.ఈ నిధులతో వేగంగా రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. పనులకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు.

తరలెళ్లిపోతున్న పల్లె జనం

(మొదటి పేజీ తరువాయి)

50 నుంచి 100 కుటుంబాలకు పైగా ఇప్పటికే ఊరు వదిలి వెళ్లారు. ముఖ్యంగా తెలంగాణలోని మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు, ఏపీలోని గుంటూరు జిల్లాకు వెళ్తున్నారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పది వేల కుటుంబాలు పొట్టచేత పట్టుకొని సుగ్గి బాటన సాగిపోయి ఉంటారని అనధికారిక అంచనా. దీంతో గ్రామాలన్నీ బోసిపోతున్నాయి. తల్లిదండ్రులతో పిల్లలు కూడా వెళ్లడంతో పాఠశాలల్లో హాజరు తగ్గిపోతోంది.



వలస వెళ్తున్న పిల్లలకు వీడ్కోలు పలుకుతున్న వృద్ధులు

కిలో పత్తి తీస్తే రూ. 15

కర్నూలు జిల్లాలో 5.62 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అత్యధికంగా పత్తిసాగు చేసిన జిల్లాల్లో గుంటూరు తర్వాతి స్థానం దీనిదే. అయితే అధిక వర్షాలకు తేమ ఎక్కువై చెట్టుపైన కాయలు నల్లగా మారి కుళ్లిపోయాయి. ఉన్న అరకొర పత్తి చెట్టు పైనే మొలకలొచ్చి నేలపాలయింది. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు పైగా దిగుబడి రూపంలో నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్ద రైతులు పత్తితీత పనులకు పిలిచినా రూ. 300-400 మించి కూలి ఇవ్వడం లేదు. ఆరు నెలలుగా ఉపాధి హామీ కూలి డబ్బులు అందకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారం అవుతుండటంతో వలసబాట పట్టారు. మహబూబ్‌నగర్, వికారాబాద్, గుంటూరులో కిలో పత్తి తీస్తే రూ. 15 నుంచి రూ. 18 చొప్పున ఇస్తున్నారు. 'దంపతులిద్దరూ రోజుకు వంద కిలోల పత్తి తీస్తే రూ. 1,500 వస్తుంది. ఇద్దరు పిల్లలు కూడా పనిలోకి వెళితే మరో రూ.వెయ్యి సంపాదించవచ్చు. ఇలా రోజుకు సుమారు రూ. 2,500, నెలంతా కష్టపడితే దాదాపు రూ.50 వేల నుంచి 60 వేలు సంపాదించుకోవచ్చని వలస బాట పట్టారు. గుంటూరు జిల్లాలో పత్తి తీత పనులు అయిపోగానే మిరప కోత పనులు మొదలవుతాయి. నాలుగైదు నెలలు పనులు ఉంటాయని ఆ జిల్లాకు ఎక్కువ వెళ్తున్నారు.

ఆ ప్రాజెక్టులు పూర్తి చేస్తేనే..

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణే ప్రధాన లక్ష్యంగా 2019లో నాడు టీడీపీ ప్రభుత్వం వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి నిధుల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులను అటకెక్కించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశించినా ఇప్పటి వరకూ పనుల్లో కదలికలేదు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పల్లెసీమల వలసలకు అడ్డుకట్ట వేయాలంటే ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణమే ఏకైక పరిష్కార మార్గమని రాయలసీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

ఆరెకరాలున్నా.. వలస బాటే

చింతకుంటకు చెందిన పుసులు యల్లప్ప, పద్మ దంపతులకు బోరుబావి కింద ఆరెకరాల పొలం ఉంది. 3 ఎకరాల్లో పత్తి, మరో 3 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. రూ.4 లక్షలకు పైగా అప్పు చేశారు. ధరలు పతనమవడంతో ఉల్లి పంటను పొలంలోనే వదిలేశారు. అధిక వర్షాలకు పత్తికూడా పాడైపోయింది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక బడికి వెళ్లే ఇద్దరు పిల్లలను తీసుకొని వికారాబాద్‌కు వలస వెళ్తున్నానని యల్లప్ప చెప్పాడు.

యూజ్‌లెస్ ఫెలో.. ఎవడ్రా నువ్వు!

- ఎమ్మెల్యే బూర్లపై నోరు పారేసుకున్న మాల మహానాడు నేత గోళ్ల
- తురకపాలెం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ అసభ్య పదజాలంతో దూషించారు. తురకపాలెంలో వరుస మరణాల నేపథ్యంలో ఆదివారం ఆయా కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం 28మందికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో బాధితులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీచేశారు. ఈ సాయం ప్రభుత్వం చేస్తోందని, దళారులు డబ్బులు అడిగితే ఇవ్వద్దని సూచించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అరుణ్ కుమార్ ఎమ్మెల్యేను చూస్తూ అంత దౌర్భాగ్యం తమకు రాలేదన్నారు. ఒక సమయంలో నియంత్రణ కోల్పోయి ఎమ్మెల్యే వైపు వేలు చూపిస్తూ 'ఎవడ్రా నువ్వు.. యూజ్ లెస్ ఫెలో' అంటూ దూషించడంతో పాటు తిట్లపర్వం అందుకున్నారు. ఈ ఘటనతో కేంద్ర మంత్రి, అధికారులు షాకయ్యారు. ఎమ్మెల్యే మీదకు దూసుకువచ్చిన అరుణ్‌కుమార్‌ను పోలీసులు తీసుకువెళ్లి పోయారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు నాయకులను గ్రామస్థులు అడ్డుకున్నారు. మా ఊళ్లో మీ పెత్తనం ఏమిటని నిలదీశారు. కాగా, కొందరు బాధితులు తమకూ ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు.



ఎమ్మెల్యే బూర్లకు వేలు చూపిస్తూ మాట్లాడుతున్న గోళ్ల అరుణ్‌కుమార్

డిజిటల్ ప్లంబింగ్‌తో విస్తృత పెట్టుబడులు

- బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ అభివృద్ధి
- 'ఆంధ్రజ్యోతి'తో సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



"డిజిటల్ ప్లంబింగ్"తో విశాఖపట్నానికి విస్తృత స్థాయిలో విదేశీ పెట్టుబడులు వస్తాయని సిఫీ టెక్నాలజీస్ చైర్మన్ రాజు వేగేశ్న తెలిపారు. రుషికొండ ఐటీ పార్కులో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. విశాఖ కాస్మోపాలిటన్ నగరమని, ప్రస్తుతం ఐటీలో ద్వితీయ శ్రేణి (టైర్-2) నగరంగా ఉందని, త్వరలో ప్రథమ శ్రేణి నగరాలతో పోటీ పడుతుందని చెప్పారు.

ప్రశ్న: డిజిటల్ ప్లంబింగ్ అంటే..?

రాజు వేగేశ్న: సముద్రం అంతర్భాగం నుంచి తీసుకువచ్చే సబ్‌మెరైన్ కేబుళ్లతో విశాఖలోని సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను అనుసంధానం చేస్తాం. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న సమాచారాన్ని ఇక్కడికి తీసుకొస్తాం. అవసరమైన రాష్ట్రాలకు, దేశాలకు పంపిస్తాం. ఇలా డేటాని పంపింగ్ చేయడాన్ని 'డిజిటల్ ప్లంబింగ్'గా వ్యవహరిస్తాం. ఇందులో విశాఖ అగ్రస్థానంలో నిలవనుంది. డిజిటల్ ప్లంబింగ్ వల్ల మరిన్ని డేటా సెంటర్లు వస్తాయి. త్వరలోనే ఒక గిగావాట్, రెండు గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు ఏర్పాటవుతాయి. విదేశీ పెట్టుబడులు వస్తాయి. ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుంది.

భారీగా ఉద్యోగాలు వస్తాయా?

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు ఎలాగైతే ఇంజనీర్లను, డాక్టర్లను తయారు చేసి సమాజానికి అందిస్తున్నాయో.. డేటా సెంటర్లు కూడా ఆ విధంగానే పనిచేస్తాయి. వీటి వల్ల ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నా.. పరోక్షంగా ఎకో సిస్టమ్ అభివృద్ధి చెంది పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. ఐటీలో అగ్రస్థానంలో ఉన్న బెంగళూరుతో పోటీ పడేలా విశాఖ ఎంతో అభివృద్ధి సాధిస్తుంది.

ఈ రంగంలో మీకున్న అనుభవం ఏమిటి?

భారత్‌లో 25ఏళ్ల క్రితమే డేటా సెంటర్లను సిఫీ ప్రారంభించింది. ముంబైలో 250 మెగావాట్లు, నోయిడాలో 130 మెగావాట్లు, చెన్నైలో మరో 130 మెగావాట్ల డేటా సెంటర్లు నిర్వహిస్తున్నాం. నాస్డాక్‌లో నమోదైన రెండు కంపెనీల్లో ఒకటి ఇన్ఫోసిస్ అయితే రెండోది సిఫీ. డేటా సెంటర్ ఆపరేషన్లు రెండేళ్లలో ప్రారంభించాలనే లక్ష్యంతో విశాఖ వచ్చాం. నేనూ ఏపీకి చెందినవాడినే. మంత్రి లోకేశ్ చాలాకాలం నుంచి తెలుసు. విశాఖ కాస్మోపాలిటన్ నగరం. ఇక్కడ అన్ని ప్రాంతాల వారు ఎటువంటి భేదభావాలు లేకుండా కలిసి మెలిసి ఉంటారు. ఇక్కడ అందమైన బీచ్‌లు ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. వీటన్నింటి కంటే మంచి పాలసీలు, పూర్తి సహకారం అందించే ప్రభుత్వం ఉండటం వల్లనే ముందుకొచ్చాం.

హైదరాబాద్‌కు దీటుగా విశాఖ

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. అనంతరం రుషికొండ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో సిఫీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశాన్ని లోకేశ్ జ్యోతి వెలిగించి ప్రారంభించి, ప్రసంగించారు. గత 17 నెలల్లో రాష్ట్రానికి 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా అందులో 50శాతానికి పైగా విశాఖ జిల్లాకే వచ్చాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు భారీగా రావడం ఇదే మొదటిసారని, ఇదంతా ఒక్కరోజులో సాధ్యం కాలేదని చెప్పారు. సుదీర్ఘ చర్చలు, అనేక మంది కీలకంగా వ్యవహరించడం వల్లనే వచ్చాయన్నారు. సిఫీ సంస్థను ఏపీకి రప్పించడానికి ఎనిమిదేళ్లు పట్టిందన్నారు. రాష్ట్రానికి విశాఖపట్నమే ఆర్థిక రాజధాని అని, అభివృద్ధి విషయంలో వికేంద్రీకృత విధానం అనుసరిస్తున్నామని చెప్పారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో ఒక్క విశాఖలోనే 5లక్షల ఐటీ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. టీసీఎస్‌కు ఎకరా భూమి 99 పైసలకే ఇస్తే విమర్శించారని, అయితే ఆ నిర్ణయం కారణంగా కాగ్నిజెంట్, యాక్సెంచర్, ఏఎన్ఎస్ఆర్, సత్వాల్, గూగుల్ వంటి పెద్ద సంస్థలు విశాఖకు వచ్చాయన్నారు. పెట్టుబడుల విషయంలో ఏపీ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతోనే కాకుండా ఇతర దేశాలతో కూడా పోటీ పడుతోందని చెప్పారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) కేంద్రంగా ఏపీని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఏ జీసీసీ అయినా ఏపీకే రావాలన్నారు.

బుల్లెట్ ట్రైన్ వేగం

ఏపీలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కారు మాత్రమే కాదని, బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకుపోయే ప్రభుత్వమని లోకేశ్ అభివర్ణించారు. ఎవరైనా పెట్టుబడులు పెట్టడానికి ఢిల్లీ వెళితే... ఏపీకి వెళ్లాలని, అక్కడ వేగంగా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వం ఉందని సూచిస్తున్నారని, అది రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. రైల్వే జోన్ సాధించుకున్నామని, విశాఖ స్టీల్ ప్లాంటు కష్టాల్లో ఉంటే కేంద్రం రూ.11,440 కోట్లు ఇస్తే రాష్ట్రం రూ.4 వేల కోట్ల సాయం అందిస్తోందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో స్టీల్ ప్లాంటు ఒక్క బ్లాస్ట్ ఫర్నేస్‌తో నడిస్తే ఇప్పుడు 3 బ్లాస్ట్ ఫర్నేసులతో 85% ఉత్పత్తి చేసే స్థాయికి చేరిందని తెలిపారు. మరో 3 నెలల్లో విశాఖకు మరిన్ని పెట్టుబడులు వస్తాయని చెప్పారు. విశాఖ అభివృద్ధికి రాష్ట్ర మంత్రివర్గం బ్లాంక్ చెక్ ఇచ్చిందని, దాంతో దూకుడుగా వెళ్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సిఫీ రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి మందికి ఉపాధి లభిస్తుంది. తొలిదశలో 50 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేస్తారు.



సిఫీ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న లోకేశ్

4 జిల్లాలతో గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్: లోకేశ్

ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు 4 జిల్లాలతో 'గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేస్తున్నామని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. 'మహా విశాఖ ఆర్థిక మండలి' నిర్వహణ, విధివిధానాలపై సీఎం ప్రకటన చేస్తారని చెప్పారు. పరిశ్రమలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే నాటికి రోడ్లు, ఇతర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటుకానున్న పరిశ్రమలు, కంపెనీల ద్వారా 5లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్రానికి వచ్చిన రూ.లక్ష కోట్ల పెట్టుబడుల్లో సగం గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్‌కు వచ్చాయన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలంటే గ్రేటర్ జోన్ ఆర్థిక వృద్ధి ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించామని వివరించారు. వచ్చేనెల 14, 15ల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సులో మరిన్ని కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటామన్నారు. మంగళవారం సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి గూగుల్‌తో ఒప్పందం కుదుర్చుకోనున్నారని చెప్పారు. గూగుల్ సంస్థ ద్వారా దేశంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడి ఇదేనన్నారు. టీసీఎస్‌కు కేటాయించిన భూముల్లో వచ్చే నెలలో శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. డిసెంబరులో కాగ్నిజెంట్ ప్రాజెక్టు శంకుస్థాపనకు సీఈవో వస్తున్నారని తెలిపారు. దేశంలో అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఉమ్మడి విశాఖలో ఏర్పాటుకాబోతున్నదన్నారు.

బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు..

- వాడపల్లి వెంకన్న సన్నిధిలో మహాసుదర్శన హోమం
- వైభవంగా తోమాల సేవ
- ఆకట్టుకున్న ప్రదర్శనలు



ఉత్సవమూర్తులకు మహాస్నపనము దృశ్యం



హనుమత్ వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

నేడు..

వాడపల్లిలో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు సోమవారం యోగ నారసింహ అలంకరణలో శ్రీవారి సింహవాహన సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఆత్రేయపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఆదివారం బ్రహ్మాండంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొని తరించారు. ఉదయం స్వామివారిని వసంత మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదిక వద్దకు తోడ్కొని వచ్చి వైఖానస శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు బ్రహ్మోత్సవ పూజలను నిర్వహించారు. ఉదయం 9.10 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, మహాస్నపనము, హోమములు, దుష్టగ్రహ పరిహారార్థం మహాసుదర్శన హోమం, వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. అనంతరం మేళతాళ మంగవాయిద్యాలతో తోమాల ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం స్వామివారికి సమర్పించి తోమాల సేవను నిర్వహించారు. కేరళవాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వస్తివచనం ప్రధాన హోమములు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దంపతులు పాల్గొన్నారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్‌శోభగుల నడుమ శ్రీవారు కోదండరామ అలంకరణలో అలంకృతుడై హనుమత్‌వాహనంపై తిరువీధుల్లో వివిధ కళాకారుల ప్రదర్శనల నడుమ విహరించి కృపాకటాక్షాలు అందించారు.



మహిళా కళాకారుల వాయిద్య ప్రదర్శన

బాణసంచా పేలుడు ఘటనలో పదికి చేరిన మృతుల సంఖ్య

- చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి
- తమకు న్యాయం చేయాలంటూ అనపర్తిలో బంధువుల ఆందోళన



యామిని (ఫైల్)



వెంకటకృష్ణ (ఫైల్)

అనపర్తి/ రాయవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం విసావరం గ్రామ పరిధిలో గణపతి ఫైర్ వర్క్స్‌లో ఈనెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ఆదివారం నాటికి మృతుల సంఖ్య పదికి చేరుకుంది. సంఘటనలో ఆరుగురు సజీవ దహనం కాగా మరో నలుగురు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా అదే రోజు ఒకరు, మరుసటి రోజు ఒకరు, ఆదివారం మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ప్రమాదం జరిగిన రోజు యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ, పాకా అరుణ, చిట్టూరి శ్యామల, పెంకే శేషారత్నం, కురుపూడి జ్యోతి, కె.సదానంద్ సజీవదహనం కాగా అదే రోజు ఆసుపత్రిలో పొట్నూరి వెంకటరమణ మృతి చెందగా మరుసటి రోజు వాసంశెట్టి విజయలక్ష్మి చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆదివారం చిట్టూరి యామిని (30), లింగం వెంకటకృష్ణ(22) చికిత్స పొందుతూ మృతి చెందారు. కాకినాడలో జీజీహెచ్‌లో అనపర్తికి చెందిన చిట్టూరి యామిని మృతి చెందడంతో పోస్టుమార్టం అనంతరం అధికారులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని అనపర్తికి తరలించారు. అయితే యామిని బంధువులు మృతదేహాన్ని కొమరిపాలెంలోని యజమాని ఇంటికి తరలించే ఆలోచన చేయడంతో పోలీసులు అంబులెన్స్‌ను రెండు జీపులతో వెంబడించారు. బలభద్రపురం వంతెన వద్ద కొమరిపాలెం వైపు అంబులెన్స్‌ను మలుపు తిప్పే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు మృతదేహాన్ని అనపర్తిలోని యామిని ఇంటికి చేర్చారు. అంబులెన్స్ నుంచి మృతదేహాన్ని దించేది లేదంటూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి యామిని ఇంటికి అధికారులను పంపించడమే కాకుండా ఫోన్‌లో యామిని భర్త శ్రీనుతో మాట్లాడారు. ఇప్పటికే విచారణ కోసం కమిటీని నియమించడం జరిగిందని, 2,3 రోజుల్లో ఎక్స్‌గ్రేషియా ప్రకటన వెలువడుతుందని ఆందోళన చెందవద్దంటూ వివరించారు. యజమాని కుమారుడు చిట్టిబాబు కూడా శ్రీనుతో మాట్లాడటంతో మృతుల బంధువులు శాంతించారు. మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పెదపూడి మండలం వేండ్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ(22) ఆదివారం మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది.

తల్లీకూతూరు సాధించారిలా

- హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తల్లీతనయలకు ఒకేసారి సభ్యత్వం



హైకోర్టు బార్ కౌన్సిల్‌లో ఒకేసారి సభ్యత్వం పొందిన తల్లీకూతుళ్లు

కాకినాడ/జీజీహెచ్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లి, తనయ ఇద్దరూ ఒకేసారి ఏపీ హైకోర్టు బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా పేర్లు నమోదు చేసుకున్న అరుదైన ఘటన కాకినాడలో జరిగింది. కాకినాడ రామారావుపేటకు చెందిన మల్లిపూడి మెహెరానీ, ఆమె కుమార్తె లక్ష్మీ ఐశ్వర్య ఇద్దరూ న్యాయ విద్యనభ్యసించి.. న్యాయవాదులుగా హైకోర్టు బార్ కౌన్సిల్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మెహరానీకి చిన్నప్పటి నుంచీ చదువంటే ప్రాణం. న్యాయవాదిగా మారాలనేది ఆమె సంకల్పం. తొలుత బీఎస్సీ డిగ్రీ పూర్తి చేయాలనుకున్న ఆమెకు తల్లిదండ్రులు వివాహం చేయడంతో అది నెరవేరలేదు. వివాహం అనంతరం ఆమె భర్త జీవీవీ సత్యనారాయణ ప్రోత్సాహంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసింది. అనంతరం రాజీవ్‌గాంధీ లా డిగ్రీ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరి.. తన కలను నెరవేర్చుకుంది. తనకు ఇష్టమైన న్యాయవాది డిగ్రీ పట్టా పొందింది. ఇక మరోవైపు తల్లి మెహెరానీ లాగే తనయ లక్ష్మీ ఐశ్వర్య కూడా న్యాయవాద వృత్తినే ఎంచుకుంది. ఆమె ఒడిశాలోని నేషనల్ లా యూనివర్సిటీ నుంచి బీబీఏ ఎల్ఎల్‌బీ (ఆనర్స్) పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం చదువుతోంది. దీంతో తల్లీకుమార్తెలు ఇద్దరూ ఒకే రోజున రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్‌లో సభ్యులుగా చేరారు. తన భర్త సత్యనారాయణ (ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెకర్), కుటుంబసభ్యుల సహకారంతో ఇది సాధ్యమైందని మెహరానీ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. వారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు అభినందించారు.

పంచాయతీ ఉద్యోగులకు తీపి కబురు

- గ్రేడ్-1 కార్యదర్శులు 22 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

సామర్లకోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ వీఆర్.కృష్ణతేజ్ ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం జిల్లాకు చేరిన ఈ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ పంచాయతీలలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్న 22 మంది అధికారులకు పదోన్నతులు కల్పించారు. వీరిని త్వరలో ఖాళీగా ఉన్న మండలాల్లో నియమించనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 16 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సమాచారం. ఒకేసారి ఈ పోస్టులు భర్తీ కానున్నాయి. అలాగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు కూడా పదోన్నతి బదిలీలు కానున్నాయి. దీంతో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల ముఖాలలో దీపావళి కాంతులు ముందే రావడం విశేషం.

అనకాపల్లిలో యువతి కిడ్నాప్ చేబ్రోలులో బెదిరింపులు

- కారులో తిప్పుతున్న వ్యక్తులను పట్టుకున్న గొల్లప్రోలు పోలీసులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో యువతిని కిడ్నాప్ చేసి వివిధ ప్రాంతాల్లో కారులో తిప్పి కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో బెదిరిస్తుండగా పోలీసులు యువతిని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన యువతి కర్రి వంశీ, మహమ్మద్ అల్తాఫ్ అనే ఇద్దరిని ప్రేమించింది. దీనిపై వారి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11న ఉదయం 11గంటల సమయంలో అల్తాఫ్ సదరు యువతిని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అల్తాఫ్, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని వివిధ ప్రాంతాల మీదుగా తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకెళ్లారు. ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. మళ్లీ సాంబ అనే మరో వ్యక్తితో యువతిని బెదిరించడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువతిని, బెదిరించిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. యువతి ఫిర్యాదుపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో సీసీ కెమెరాలు

- విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం : మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రాజమహేంద్రవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీ హాస్టళ్లను మెరుగుపరిచే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నాం. ప్రతీ వసతిగృహం, గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్లర్లు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంక్షేమ, చేనేత, జౌళి, లేపాక్షి శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. బీసీ వసతి గృహాల పరిస్థితిపై ఆరా తీశారు. సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ నిధులతో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. దోమలు రాకుండా మెస్‌లను ఉంచాలని, వేడి చేసి చల్లార్చిన నీరు, తాజాగా వండిన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. విశ్రాంతి, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడుకోవడానికి క్వాయిన్ ఫోన్ సౌకర్యం కల్పించాలని ఆమె సూచించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు సక్రమంగా ఉండాలని, వసతి గృహాల్లోని విద్యార్థులను అధికారులు తమ పిల్లలుగా భావించి బాధ్యతగా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తరచూ గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు విధానం, పరిశుభ్రతను పరిశీలించాలన్నారు.

ఆప్కో లేపాక్షి విక్రయాల పెంపు

ఆప్కో, లేపాక్షి విక్రయాలు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ఇప్పటికే మార్కెట్‌లో ఆప్కో రెడీమేడ్ వస్త్రాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. మేక్ ఇండియా -మేడ్ ఇండియా దిశగా స్వదేశీ వస్తువులను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అలవాటు చేయాలన్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పథకాల అమలు మరింత వేగవంతం కావాల్సి ఉందని చెప్పారు. ఈ ప్రాంతాల్లో 16 ఆప్కో షాపులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆంధ్రప్రదేశ్ బీసీ కో ఆపరేటివ్‌గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆప్కో జీఎం కె.పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

యానాం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): యానాంలో శనివారం జరిగిన దారుణ హత్య కేసులో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం యానాంలో కాకినాడ జిల్లా కాజులూరు మండలానికి చెందిన తిప్పిరిశెట్టి నారాయణస్వామి (33) హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్య ఘటనలో నిందితుడు మోకా ఆనందమూర్తి పరారీలో ఉండడంతో పట్టుకున్నామని యానాం సీఐ అడలరసన్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం సాయంత్రం యానాం పోలీస్‌స్టేషన్‌లో మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఆనందమూర్తి తండ్రి మోకా వెంకటేశ్వరావు(57)ను గతంలో ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో చీటీల వ్యాపారి తిప్పిరిశెట్టి నారాయణస్వామి విచక్షణా రహితంగా దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ప్రతీకారం తీర్చుకునేందుకు ఆనంద్‌మూర్తి నారాయణస్వామిని హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. రిమాండ్ విధించడంతో ఆనంద్‌మూర్తిని యానాం సబ్‌జైల్‌కు తరలించారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి విజయవాడ కానూరుకు చెందిన జన్ను రమేష్-లావణ్య దంపతులు రూ.1,11,116విరాళం సమర్పించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆదివారం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి

మండపేట, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం పాలతోడులో ఉన్న గ్రామదే వత అమ్మవారిని పెద్దాపురం జిల్లా అదనపు 7వ న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ దేవత దర్శనంకోసం వచ్చిన చంద్రమౌళీశ్వరికి ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే

మలికిపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాజోలు నియోజకవర్గంలో 14నెలల్లో 510మందికి రూ.4.40కోట్లు అందించామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద 66మందికి మంజూరైన రూ.36లక్షల చెక్కులను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆర్థిక వెసులుబాటు అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నానన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

లక్కవరంలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికిముఖ్యమంత్రితో మాట్లాడినట్టు చెప్పారు. భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, డయాలసిస్ రోగుల సంఖ్య పెరిగిందన్నారు. దీని కోసం మరో రెండు యూనిట్లను పెంచామన్నారు. సమావేశంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఏఎంసీ చైర్మన్ కె.వెంకటలక్ష్మి, గుబ్బల ఫణి, ముప్పర్తి నాని, మాలే శ్రీనివాస్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, ఆకన బాబ్జినాయుడు, దిరిశాల బాలాజీ, ఎస్.శ్రీనివాస్, అడబాల యుగంధర్, పినిశెట్టి బుజ్జి, ఎం.సత్తిబాబు, సర్పంచ్‌లు రాపాక ఆనంద్ కుమార్, కడలి దుర్గాదేవి, హెలీన, దొడ్డా జయరామ్, ఉంగరాల బాలాజీ పాల్గొన్నారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



కొమర గిరిపట్నంలో కాలం చెల్లిన 63కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- అంధకారంతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ

అల్లవరం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి నెలలు గడుస్తున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ సమస్యలు తలెత్తితే సకాలంలో స్పందించే విద్యుత్ అధికారులు ప్రజల ఇళ్ల వద్ద సమస్యలను పట్టించుకోడం లేదని ఆరోపిస్తున్నారు. కొమరగిరిపట్నం సుంకరవారివీధిలో కాలం చెల్లిన 63కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోడు ఎత్తుకోక విద్యుత్ సరఫరా లేక ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణణాతీతం. సుంకరవారి వీధిలో మరో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ది కూడా ఇదే పరిస్థితి. డి.రావులపాలెం చాట్ల పట్టాభిరామారావు రేకుషెడ్డు ఇంటి వద్ద సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా మార్చలేదని ఆరోపిస్తున్నారు. ఈట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే ప్రైవేటు పాఠశాల బస్సు ఆగుతుండడంతో చేతికందే ఎత్తులో ఉండే ఈట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం జరిగే పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొమరగిరిపట్నంలో 60కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు శాంక్షన్ ఆర్డరు వచ్చాక మారుస్తామని విద్యుత్ ఏఈ బి.వెంకటేశ్వరరావు అన్నారు. విద్యుత్ సమస్యలపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.



డి.రావులపాలెంలో కాలిపోయిన సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

నాన్ గెజిటెడ్ రాష్ట్ర అధ్యక్షుడిగా స్వామినాయుడు



చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో స్వామినాయుడును అభినందిస్తున్న దృశ్యం

అమలాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన రేళ్ల వెంకటస్వామినాయుడు ఎన్నిక కావడాన్ని హర్షిస్తూ ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున ఆదివారం సాయంత్రం స్థానిక గోల్డ్ మర్చంట్స్ భవనంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, ముఖ్య సలహాదారుడు నల్లా పవన్‌కుమార్, గౌరవ కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, వలవల శివరావు, అనుపోజు శ్రీను, గోల్డ్‌మార్కెట్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులతో పాటు పలువురు స్వామినాయుడుకు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలో నాన్ గెజిటెడ్ అధ్యక్షుడిగా స్వామినాయుడు ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణలో ఆర్ఎస్ఎస్ పాత్ర



కొమరగిరిలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వ్యాయామ యోగ్

ఐ.పోలవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణలో ఆర్ఎస్ఎస్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కొమరగిరిలో ఆదివారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతజయంత్యుత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, రాళ్ళపల్లి పాపాయశర్మ, సలాది శ్రీనివాసరావు, పేరాబత్తుల రామకృష్ణారావు, బొంతు కనకారావు, ఏలూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ సమావేశం

మామిడికుదురు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ శత సంవత్సరాల సమావేశం లూటుకుర్రు కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు దాట్ల విజయరామరాజు, యుగంధర్, మైలవరపు రఘురామ్‌లు పాల్గొని దేశభక్తే ప్రధాన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందని, క్రమశిక్షణ కలిగిన సంస్థగా వందేళ్ల దిగ్విజయంగా పూర్తి చేసుకుందన్నారు. ఆర్ఎస్ఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

రావులపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ముగింపును పురస్కరించుకుని అమ్మవారి గ్రామోత్సవాలు ఘనంగా జరిగాయి. ముమ్మిడివర్పాడులో అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచాకాల్పుల నడుమ ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రెండు కుటుంబాలకు సాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వెల్ల సావరానికి చెందిన నందికోళ్ల దుర్గాదేవి అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెకు మంత్రి సుభాష్ రూ.10వేలు అందజేశారు. కె.గంగవరం మండలం అద్దంపల్లికి చెందిన రుద్రాక్షల వీరబాబు కిడ్నీవ్యాధితో బాధపడుతుండటంతో రూ.20వేలు మంత్రి సుభాష్ అందజేశారు.

వాడపల్లి వెంకన్నకు తెలంగాణ హైకోర్టు జడ్జి పూజలు

ఆత్రేయపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తెలంగాణా హైకోర్టు జడ్జి టి.మాధవిదేవి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వేద ఆశీర్వచ నం అందుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో చక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. మచిలీపట్నం జిల్లా జడ్జి పి.పాండురంగాదేవి దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

హామీని నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

- బాధిత కుటుంబానికి రూ.5లక్షలు అందించిన ఎమ్మెల్యే దాట్ల

ముమ్మిడివరం/ఐ.పోలవరం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆరేళ్ల క్రితం ఒక బాలుడి తల్లికి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఐ.పోలవరం మండలం భైరవపాలేనికి చెందిన నాలుగేళ్ల చిన్నారి కామాడి అభి 2019లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో చేయి కోల్పోయింది. ఆ సంవత్సరం గ్రామ పర్యటనలో పాల్గొన్న నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 2024లో తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు దృష్టికి ఈవిషయాన్ని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తీసుకువెళ్లి సీఎం సహాయనిధి నుంచి రూ.5లక్షలు మంజూరు చేయించారు. అభి తల్లి ఆదిలక్ష్మికి ఆదివారం చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే సుబ్బరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు

ముమ్మిడివరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ఆదివారం ముమ్మిడివరం గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతుందని లైబేరియన్ ఎస్.నాగరాజు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందించి గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలాన్ని సేకరించి త్వరలోనే భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విళ్ల వీరాస్వామినాయుడు, జాగు రాంబాబు, జాగు సత్తిబాబు, దొమ్మేటి రమణకుమార్, దాట్ల బాబు, నిమ్మకాయల విస్సు, చంద్రమౌళి, గణేష్, ముక్కవల్లి శ్రీనివాస్, శీలం వెంకటరమణ, ఆకుల దుర్గాప్రసాద్, గ్రంథాలయశాఖ సిబ్బంది వి.శ్రీహరి, ఏవీ నారాయణ, కె.శ్రీనివాస్, ప్రసాద్, కె.తులసీలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు.. ప్రమాదాల జోరు

మామిడికుదురు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్లు వెడల్పుచేసి రోడ్లపై ఉన్న విద్యుత్ స్తంభాలను తీయకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. పాశర్లపూడి నుంచి అప్పనపల్లికి వెళ్లే దారిలో కాజ్‌వే వద్ద రోడ్డు వెడల్పుచేసి రోడ్డు మీదే ట్రాన్స్‌ఫార్మర్‌ను వదిలివేశారు. అదే విధంగా మొగలికుదురులో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు వదిలివేయడంతో పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. రోడ్లు వెడల్పుచేసి విద్యుత్ స్తంభాలు వదిలివేయడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు తొలగించడానికి అవసరమైన ఖర్చు చెల్లిస్తే గానీ వాటిని తీసే పరిస్థితి లేదని విద్యుత్ స్తంభాలను మార్చాల్సిన విద్యుత్, రోడ్లు భవనాల శాఖాధికారులు పేర్కొంటున్నారు.అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పాశర్లపూడి కరకట్ట సమీపంలో రోడ్డుపైనే ట్రాన్స్‌ఫార్మర్



మొగలికుదురులో రోడ్డుపైనే ఉన్న విద్యుత్ స్తంభం

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మామిడికుదురు హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం మామిడికుదురు హైస్కూలులో ఆదివారం జరిగింది. 1980-81లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్కూలులో కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయయు వి.చిరంజీవిరావు పాల్గొని ఇటువంటి కార్యక్రమాలు తరచుగా జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యక్కలదేవర రాజు, ఎన్వీవీ సత్యనారాయణ, పొలమూరి సత్యనారాయణ, గంధం వెంకటరమణ, నయినాల రాధ, బొంతు అజయ్‌కుమార్, నయినాల వరలక్ష్మి, కసిరెడ్డి చెల్లమ్మ, చిట్టూరి సుబ్రహ్మణ్యం, వర్ధినేని శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నవజనార్దనస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆలమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలో నారదమహాముని ప్రతిష్ఠించిన నవజనార్దనస్వామి విగ్రహాలను దర్శించుకోవడానికి విశాఖపట్నం నుంచి భక్తులు బస్సులో ఆలమూరు మండలానికి విచ్చేశారు. ఆలమూరు, జొన్నాడ, మడికి జనార్ధనస్వామి ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ధవలేశ్వరం, కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి, మండపేట గ్రామాల్లోని ఆలయాలను దర్శించుకోనున్నట్లు భక్తులు వివరించారు. ఆలమూరు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికారు.

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ట్రాక్టర్ ప్రదక్షిణ!

- ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులు
- కార్యాలయాల చుట్టూ తిప్పుతున్న వైనం
- ట్రక్కులో చెత్త వేస్తున్న స్థానికులు
- దుర్గంధంతో సిబ్బంది ఇబ్బందులు

పి.గన్నవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఒక ట్రాక్టర్ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది. రోజుల తరబడి పి.గన్నవరం పోలీసు స్టేషన్, పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ ఆ ట్రాక్టర్ తిరుగుతోంది. ఇది అసలు కథ. ఒక ట్రాక్టర్‌ను ఏడాది క్రితం పి.గన్నవరం పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈట్రాక్టర్‌ను నిర్మాణంలో ఉన్న పి.గన్నవరం పంచాయతీ భవనం ఎదుట ఉంచారు. దీంతో స్థానికులు ఆ ట్రాక్టర్ తొట్టెలో చెత్త వేయడంతో దుర్వాసన రావడంతో సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది పంచాయతీ కార్యదర్శి ద్వారా పోలీసులకు రాతపూర్వకంగా సమస్యను తెలియజేశారు. దీంతో ట్రాక్టర్‌ను ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగంలో ఉంచారు. స్థానికులు మళ్లీ ట్రాక్టర్ తొట్టెలో చెత్త వేయడంతో దుర్వాసనతో సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎంపీడీవో మల్లికార్జునరావు సమస్యను ఎస్ఐ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఎంపీడీవో కార్యాలయం వెనుక చెత్తతో ఉన్న ట్రాక్టరు

పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ పరీక్ష



స్కాలర్‌షిప్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ స్పర్శ యోజన పరీక్షను అమలాపురం పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీవాగ్దేవి స్కూలులో నిర్వహించారు. స్కాలర్‌షిప్ ప్రమోషన్ ఆఫ్ ఆప్టిట్యూడ్-రీసెర్చ్ ఇన్ స్టాంప్ హాబీ పేరిట పరీక్ష నిర్వహించారు. అమలాపురం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షకు డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 195మంది విద్యార్థులు హాజరయ్యారు. పోస్టల్‌శాఖలో విడుదలైన అనేక రకాల స్టాంప్స్‌పై అవగాహన, జనరల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు స్కాలర్‌షిప్ పోటీ పరీక్షలు ఎంతగానో దోహద పడతాయని నవీన్‌కుమార్ తెలిపారు. పోస్టల్ సబ్ డివిజనల్ ఇనస్పెక్టర్లు, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులో చిక్కుకున్న గోవు రక్షించిన డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ పరిధిలోని భోగరాజువీధిలో ఖాళీ స్థలం ప్రక్కన ఎంతోకాలంగా మూతపడి ఉన్న సెప్టిక్ ట్యాంకులో ఒక ఆవు పడిపోయింది. ఎన్ని రోజుల క్రితం చిక్కుకుపోయిందో కానీ పూర్తిగా నిరసించి పోయింది. సెప్టిక్ ట్యాంకులో పడి ఉన్న గోవును ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ జి.ప్రభాకర్ ఆదివారం ఉదయం గుర్తించారు. వెంటనే వార్డు కౌన్సిలర్ గొవ్వాల రాజేష్‌కు సమాచారం అందించారు. రాజేష్ వెంటనే మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తంచేసి పిచ్చి మొక్కలను తొలగించి గోవు ఉన్న సెప్టిక్ ట్యాంకును గుర్తించారు. గంగుమళ్ల శ్రీను, మేడిది రమేష్, రాజులపూడి భాస్కరరావుల సహాయంతో ప్రొక్లయినర్ రప్పించి స్థానికుల సాయంతో గోవును రక్షించారు.



ప్రాణాలతో బయటపడ్డ గోవు

బాణసంచా నిల్వలుంటే కఠిన చర్యలు: సీఐ

ఐ.పోలవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఎక్కడైనా బాణసంచా నిల్వలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం పోలీసు స్టేషన్లో ఎస్ఐ రవీంద్రబాబు ఆధ్వర్యంలో బాణసంచా వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. షాపుల వద్ద అగ్నిమాపక రక్షణ యంత్రాలుతప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. కేంద్రాల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. షాపుల పరిసర ప్రాంతాల్లో ధూమపానం నిషేధించాలన్నారు.

ఓపెన్ స్కూలు శిక్షణా తరగతులు వినియోగించుకోవాలి

మామిడికుదురు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూలు తరగతులను వినియోగించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓపెన్ స్కూలు కోఆర్డినేటర్ బందా చిరంజీవిరావు పేర్కొన్నారు. ఆదివారం నుంచి స్కూలులో పది, ఇంటర్ ఓపెన్ స్కూలు తరగతులు ప్రారంభమయ్యాయి. పదిలో 12మంది, ఇంటర్‌లో 18 మంది తరగతులకు హాజరైనట్టుగా హెచ్ఎం తెలిపారు. చదువుకోవాలని శ్రద్ధ ఉన్నా 14ఏళ్ల పైబడిన ప్రతీ ఒక్కరూ ఓపెన్ స్కూలులో చదువుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు భూపతి మనోహర్ రాజు, భయ్యా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేస్తా: అమూల్య

మలికిపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాజోలు నియోజకవర్గంలో బలోపేతానికి అందరితో కలిసి ముందుకు వెళతానని పార్టీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య అన్నారు. లక్కవరంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు ఇంటి వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు యువతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పార్టీని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి పనిచేస్తున్నారన్నారు. అందరినీ కలుపుకుని సమన్వయంతో ముందుకు వెళతానన్నారు.

అన్నసమారాధన

అంబాజీపేట, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బేతాళస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. వాహనసేవలో పాల్గొన్న కొత్తపాలెం హంసవాహనం ఆలయం వద్ద ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. సరస్వతీదేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు.

ఉపముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

మలికిపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కేశనపల్లి తదితర గ్రామాల్లో ఈనెల17న చేపట్టే పర్యటనను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ కోరారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ వల్ల కేశనపల్లితో పాటు 13గ్రామాల్లో ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు శాసనమండలిలో, శాసనసభలో ప్రస్తావించారని, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రైతులను పరామర్శించారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు బీజేపీ తరపున కూడా సమస్యలను వివరిస్తామని ఆయన అన్నారు.

ప్రశాంతంగా వీఏ రాత పరీక్ష

యానాం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న విలేజ్ అసిస్టెంట్(వీఏ), ఎంటీఎస్ పోస్టులకు పుదుచ్చేరి రాష్ట్ర వ్యాపంగా ఆదివారం రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. యానానికి సంబంధించి ఏడు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,917మందికి 1,284మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను పుదుచ్చేరి నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి ఇషీతారాతీ, యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ పరిశీలించారు.



అంబేడ్కర్ యువజన సంఘం నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు

ముమ్మిడివరం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.భూషణ్‌రామకృష్ణ గవాయ్‌పై దాడి ఘటనపై అయినాపురం అంబేడ్కర్ యువజన సంఘం కార్యదర్శి నీలం చిన్నబాబు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. గవాయ్‌పై దాడికి పాల్పడ్డ కిశోర్‌రాజేష్‌ను అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయుడు పెయ్యల చిట్టిబాబు, కొమ్మాబత్తుల రాహుల్, కాట్రు అప్పారావు, విశ్రాంతి ఉద్యోగులు కాశి బాలకృష్ణ, యడ్ల చిట్టిబాబు, ఇసుకపట్ల శివకుమార్, తిరుకోటి సురేష్, పెయ్యల సిద్దు, బడుగు రాంబాబు, మోకా దుర్గాప్రసాద్, జనిపల్లి నాని, అయితాబత్తుల శ్రీహరి, బడుగు సత్యనారాయణ, గుత్తాల రమేష్, సర్పంచ్ మోకా రామారామావు పాల్గొని సంఘీభావం తెలిపారు.

బస్టాండ్‌ను పునరుద్ధరించాలని రిలే దీక్ష

ముమ్మిడివరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని బస్టాండును పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. రిపబ్లికన్ పార్టీ నాయకులు యలమంచిలి సురేష్, కుంచే చినబాబు, తాటిపాక దుర్గబాబు, గంటి సత్యనారాయణ, చిట్టిబాబు, వెంకటేశ్వరరావులతో పాటు పలువురు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

కాట్రేనికోన, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాలఅభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రసౌభాగ్యం ముడిపడి ఉందన్నారు. కాట్రేనికోన గేట్ సెంటర్ నుంచి పోలీసుక్వార్టర్స్ వరకు రూ.64లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఏఎంసీచైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్, టీడీపీమండలాధ్యక్షుడు చెల్లి సురేష్, డీసీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస్, త్సవటపల్లి నాగేంద్రరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, విత్తనాల బుజ్జి, బందారు ఏసు, నల్ల రామకృష పాల్గొన్నారు.

ట్రక్కు ఆటో ఢీకొని దంపతులకు గాయాలు

అల్లవరం అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): తుమ్మలపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. బెండమూర్లంక పంచాయతీ ఆరగట్లపాలేనికి చెందిన కొల్లు షణ్ముకరావు, వెంకటలక్ష్మి దంపతులు టీవీఎస్ ఎక్సెల్-50పై వెళ్తూ ట్రక్కు ఆటోను ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డారు. వెంకటలక్ష్మి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు.

యువతిని వేధించిన యువకుడిపై కేసు

అంబాజీపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): యువతిని ప్రేమించమని వేధించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరుసుమండ గ్రామానికి చెందిన యువకుడు ఎస్.పవన్ అంబాజీపేటకు చెందిన ఓ యువతిని వెంటబడి ప్రేమించమని వేధిస్తున్నాడని ఆ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. కాగా ఆ యువతి ప్రేమించడంలేదని శనివారం స్థానిక బస్టాండ్‌లో ఆ యువకుడు గొంతు కోసుకుని చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.

18నుంచి పితృదేవతా పూజా మహోత్సవాలు



అమలాపురంలో పితృదేవతా పూజా మహోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అక్షయపాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీగౌతమ మహర్షి అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఈనెల18 నుంచి 24వ తేదీ అర్ధరాత్రి వరకు పంచదివస్ పితృదేవతా పూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాపకురాలు పోతురాజు నాగకనకదుర్గాదేవి తెలిపారు. ఈనెల18న సాయంత్రం 4గంటల నుంచి పూజా మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ధనత్రయోదశి రోజున అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి రథయాత్ర ప్రారంభమై అమలాపురం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న ప్రణవనాథ నిలయం వద్దకు యాత్ర చేరుకుంటుంది. 24వ తేదీ యమ ద్వితీయను పురస్కరించుకుని సాయంత్రం 6గంటలకు ప్రత్యేక ద్రవ్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి మహాపూర్ణాహుతి జరుగుతుంది. పితృదేవతా పూజా మహోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పితృ దేవతల అనుగ్రహ ఆశీస్సులు పొందాలని కోరుతూ అక్షయపాత్ర సభ్యుడు కరపత్రాలు విడుదల చేశారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

మండపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిబంధనలు పాటించని లైసెన్సులేని బాణసంచా తయారీ కేంద్రాలతోపాటు, దుకాణాల నిర్వాహకులపై కఠినచర్యలు తప్పవని పట్టణ ఎస్.ఐ రాము హెచ్చరించారు.మండపేట పట్టణంలో ఎస్.ఐ పోలీసు సిబ్బందితో కలిసి బాణసంచా తయారీ కేంద్రాలతోపాటు, దీపావళి సామగ్రి విక్రయించే దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

మండపేట

పనిచేయని ఆర్వో ప్లాంట్లు

● ప్రజలకు అందని తాగునీరు
● పట్టించుకోని అధికారులు


అంగరలో మూలనపడ్డ ఆర్వోప్లాంటు

కపిలేశ్వరపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయకుండా పోయాయి. దీంతో ప్రజలకు తాగునీరు అందకుండాపోయింది. చంద్రబాబు సీఎంగా పగ్గాలు చేపట్టి గత 2014 అక్టోబరు 4న తొలిసారిగా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి వచ్చిన ఆయన గ్రామాభివృద్ధి కోసం ఎన్నో వరాలు కురిపించారు. అదేరోజు గ్రామ ఎన్టీఆర్ సుజల పథకాన్ని ప్రారంభించి ప్రజలకు తాగునీరు అందించారు. కొంతకాలం ప్రజలకు తాగునీరు అందడంతో సంతోషం వెలిబుచ్చారు. అనంతరం దానిని పట్టించుకునే నాధుడు కరువవ్వడంతో అంచెలంచెలుగా రిపేర్లతో అది మూలనపడింది. దీంతో ఆప్రాంత ప్రజలకు తాగునీరు అందకుండాపోయింది. ప్రస్తుతం ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరింది. అక్కడక్కడ పైకప్పు పెచ్చులూడి ఇనుప ఊచలు బయటపడ్డాయి. తాగునీరు వచ్చే పైప్ కూడా కనుమరుగైంది. గ్రామ పంచాయతీని అనుకుని బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ బలుసు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంటు నిర్మాణం కోసం దాత భవన నిర్మాణం చేపట్టారు. అందులో గత 2014 ఆగస్టు 8న ఓఎన్జీసీ రాజమండ్రివారి సహాయంతో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటుని గ్రూపు జనరల్ మేనేజర్, అసెట్ మేనేజర్ పా సల కృష్ణారావు, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. దీంతో ఆప్రాంతవాసులకు తాగునీరు ఇబ్బందిలేకుండాపోయింది. అది కూడా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాలక్రమేణా పనిచేయకపోవడంతో ప్రజలకు నిరాశే మిగిలింది. గ్రామంలో రెండు ఆర్వోప్లాంట్లు మూలనపడడం, అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గ్రామకార్యదర్శి ఆర్.మోహన్‌ను వివరణ కోరగా గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పంచాయతీ తీర్మానంమేరకు తగుచర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.



అంగరలో సీఎం చంద్రబాబు ప్రారంభించిన ఆర్వో ప్లాంటు శిలాఫలకం, పనిచేయని యంత్రపరికరాలు

గోతులమయంగా

పలివెల-గంటి రహదారి

● వాహనదారుల ఇబ్బందులు
● పట్టించుకోని అధికారులు


గోతులమయంగా ఉన్న పలివెల- గంటి ఆర్అండ్‌బీ రోడ్డు

కొత్తపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం పలివెల-గంటి ఆర్అండ్‌బీ రోడ్డు గోతులమయంగా ఛిద్రమైంది.దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గంటి పల్లిపాలెంవాసులు మండల కేంద్రం కొత్తపేటకు రావాలంటే ఈ రహదారి ఏకైక మార్గం. బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో వాహనాల మీదే నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ ప్రధాన రహదారిపై పడిన గుంతలలో వర్షపునీరు నిలిచిపోవడంతో గుంతులు కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ రోడ్డును ఆధునీకరించి సుమారు దశాబ్దం దాటిన గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ రోడ్డు దిగబడి పెద్దపెద్ద గోతులమయంగా తయారైంది. దీనిపై అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాలలో గంటివాసులు కొత్తపేట రావాలంటే భయపడిపోతున్నారు. ఇటీవల గుంతలు పూడ్చినప్పటికీ కొంతమేర ఆధునీకరించినప్పటికీ వర్షాలుపడటంతో యథావిధిగా రాళ్లులేచిపోయి గోతులు ఏర్పడ్డాయి. సంబంధిత నియోజకవర్గ ప్రజాప్రతినిధి చొరవచూపి ఈరహదారికి మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

మండపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిబంధనలు పాటించని లైసెన్సులేని బాణసంచా తయారీ కేంద్రాలతోపాటు, దుకాణాల నిర్వాహకులపై కఠినచర్యలు తప్పవని పట్టణ ఎస్.ఐ రాము హెచ్చరించారు.మండపేట పట్టణంలో ఎస్.ఐ పోలీసు సిబ్బందితో కలిసి బాణసంచా తయారీ కేంద్రాలతోపాటు, దీపావళి సామగ్రి విక్రయించే దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.


మండపేటలో మందుగుండు సామగ్రి తయారీ కేంద్రను పరిశీలిస్తున్న ఎస్ఐ రాము

జీఎస్టీ భారాన్ని తగ్గించిన ఎన్డీఏ ప్రభుత్వం

● కార్మికశాఖ మంత్రి సుభాష్

కె.గంగవరం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వ జీఎస్టీ 2.0లో పన్ను శ్లాబులు తగ్గించి, నిత్యావసర వస్తువులపై భారాన్ని తగ్గించడంద్వారా పన్నుల వ్యవస్థను సులభతరం చేయడమే నూతన సంస్కరణల ముఖ్య ఉద్దేశమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఆయన అద్దంపల్లిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ2.0లో ప్రజలకు ఏవిధంగా మేలు కలుగుతుందో వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక చేనేత కార్మిక సంఘాలను, వ్యాపార వర్గాలను కలిసి జీఎస్టీలో స్లాబుల తగ్గించిన విధానాన్ని వివరించారు. నిత్యావసర వస్తువులపై పన్నులు తగ్గించడం


అద్దంపల్లిలో జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

వలన పేద మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. జీఎస్టీ ఫలాలు ప్రతీ వినియోగదారునికి అందేలా చూడాలని వ్యాపారులను ఆదేశించారు. చేనేత కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నా రు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించ డంతోపాటు చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కూటమి నాయకులు పెదకాపు, సురేష్ పాల్గొన్నారు.

రూ. 20వేలు ఆర్థికసాయం

గ్రామంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రుద్రాక్షుల వీర బాబుకు మెరుగైన వైద్యం కోసం రూ.20వేలు చెక్కును ఆర్థికసాయంగా అందజేశారు.

ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం



ద్రాక్షారామలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాకుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ద్రాక్షారామ,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రామచంద్రపురం మండలం హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం, వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సంఘ్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయుధ పూజ జరిపి యోగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఖండ సహకార్యవాహ బి.వి.బి.ఎల్ నారాయణ, చోడిశెట్టి వీరభద్రరావు, పుల్లెల రామమూర్తి, ఖండ ప్రచార ప్రముఖ్ గుబ్బల మురళీకృష్ణ, ఖండ కుటుంబ ప్రభోధన్ ప్రముఖ్ కోటి సత్యసూర్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటిపల్లిలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటిపల్లి గ్రామంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన భారతి ప్రసాద్, విజయలక్ష్మి ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. భారతీయ జనతాపార్టీ అనకాపల్లి ఇన్‌ఛార్జ్ కర్రి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ వక్త దత్తాత్రేయ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ సమాజానికి చేస్తున్న సేవ, లక్ష్యాలు, దేశంపై ఉన్న అకింతభావం, సమాజ ఐక్యత గురించి సవివరంగా వివరించారు. సభలో తొలుత ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హగ్డే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు అవసరాల


కె.గంగవరం సభలో మాట్లాడుతున్న దత్తాత్రేయ

రమణ మూర్తి, నున్న సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

మండపేట(ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణను మండపేట పట్టణానికి చెందిన ముస్లింనేతలు సత్కరించారు. మండపేట వచ్చిన ఆయనను స్థానిక జామియా మసీదుకు చెందిన ముస్లిం నాయకులు సల్మాన్‌హుస్సైన్, పట్టణ టీడీపీ మైనార్టీ అధ్యక్షుడు ఖరీం ఖాదరి, తదితరులు సత్కరించారు.


బీజేపీ జిల్లా అధ్యక్షుడిని సత్కరిస్తున్న ముస్లిం నేతలు

విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీక్యాంపు పార్టీ కార్యాలయంవద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యానందరావుతోపాటు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతిభా పాటవాలే భూమికగా డీఎస్సీ నియామకాలు జరిగాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ల ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రగతిపథంలో తీసుకుని వెళ్తుందన్నారు. ఉపాధ్యాయుల నియమాకాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలోను కార్పొరేట్ పాఠశాలలస్థాయిలో తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. అనంతరం మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా నియమితులైన 68 మందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్, కూసంపూడి రామకృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల బాబ్జి, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, నాయకులు పాల్గొన్నారు.

● సమాజానికి దిశానిర్దేశంచేసే ఉపాధ్యాయులపాత్ర కీలకమైనదని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ అన్నారు. రావులపాలెంలోని ఆయన కార్యాలయంవద్ద ఆత్రేయపురం మండలం ర్యాలి నుంచి ఇటీవల జరిగిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా నియమితులైన వారిని సత్కరించారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్ఆర్ జైపాల్‌రెడ్డి, కాళిదాసు గంగాధరం, దిడ్ల విక్కమార్కుడు, గూడపాటి రాజేంద్రప్రసాద్, కాకి అర్జునరావు పాల్గొన్నారు.


రావులపాలెంలో మెగా డీఎస్సీకి ఎంపికైన ఉద్యోగుల సత్కారంలో ఎమ్మెల్యే సత్యానందరావు, రెడ్డి అనంతకుమారి

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడ కానూరుకు చెందిన జన్ను రమేష్-లావణ్య దంపతులు రూ.1,11,116విరాళం సమర్పించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.


అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందించిన దాతలు

నవజనార్ధనస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


నవజనార్ధనస్వామి ఆలయాన్ని సందర్శించిన విశాఖపట్నం భక్తులు

ఆలమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరి తీరంలో నారదమహాముని ప్రతిష్ఠించిన నవజనార్ధనస్వామి విగ్రహాలను దర్శించుకోవడానికి విశాఖపట్నం నుంచి భక్తులు ప్రత్యేక బస్సులో ఆలమూరు మండలానికి విచ్చేశారు. ఆల మూరు మండలంలో ఉన్న ఆలమూరు, జొన్నాడ, మడికి జనార్ధనస్వామి ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ధవలేశ్వరం, కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి, కోటిపల్లి, మండపేట గ్రామాలలోని ఆలయాలను దర్శించుకోనున్నట్లు విశాఖ నుంచి భక్తులు వివరించారు. ఆలమూరు ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ భైరిశెట్టి రాంబాబు, కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికారు.

రెండు కుటుంబాలకు సాయం అందజేత


సాయం అందజేస్తున్న మంత్రి

రామచంద్రపురం (ద్రాక్షారామ),అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం వెల్లసావరం గ్రామానికి చెందిన నందికోళ్ల దుర్గాదేవి అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంత్రి సుభాష్ రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కె.గంగవరం మండలం అద్దంపల్లి గ్రామానికి చెందిన రుద్రాక్షల వీర బాబు కిడ్నీవ్యాధితో బాధపడుతుండటంతో రూ.20వేలు ఆర్థికసాయం మంత్రి సుభాష్ అందజేశారు.

జేవీవీ రాష్ట్రాధ్యక్షుడు చల్లాకు మాతృవియోగం

మండపేట,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మండపేట పట్టణానికి చెందిన ప్రముఖ హోమియో వైద్యుడు చల్లా రవికుమార్ మాతృమూర్తి చల్లా లక్ష్మి(81) శనివారం రాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంనుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆమె మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ కోశాధికారి కె.కృష్ణవేణి అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్ లయన్ కురసాల సత్యనారాయణ, తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ఐదేళ్లు గడుస్తున్నా పీఆర్సీ కమిటీని నియమించరా?

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు కావస్తున్నా నేటికీ పీఆర్సీ కమిటీ నియమించకపోవడంపై రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ అసోసియేట్ ప్రెసిడెంట్ వాసా దివాకర్ విస్మయం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంవద్ద విలేకరులతో మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి నుంచి వీఆర్ఏ వరకు అంద రికోసం పనిచేస్తుందన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అసోషియేట్ ప్రెసిడెంట్ పితాని త్రినాథ్ నేతృత్వంలో ముందుకు సాగుదామన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయాలని, సరెండరు లీవు, ఎరియర్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడు బండి మృత్యుంజయరావు, కార్యదర్శి బి.వెంకట భాస్కర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.హ రిచంద్రవరప్రసాద్, జాయింట్ సెక్రటరీ పడాల సత్యరామప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయానికి శంకుస్థాపన


కేశవరంలో ముత్యాలమ్మ వారి ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) మండపేట మండలం కేశవరంలో నూతనంగా నిర్మించే ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్లజోగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల ప్రత్యేక పూజలు అనంతరం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసు, మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, కేశవరం సహకార సంఘ అధ్యక్షుడు ఉండమట్ల శ్రీను, పోతురాజు స్వామి దేవస్థానం ఛైర్మన్ ఆళ్లరాజు, ఉండమట్ల తాతాజీ, పాపారావు, రాంబాబు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తి

మండపేట, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం పాలతోడులో ఉన్న గ్రామదేవత అమ్మవారిని పెద్దాపురం జిల్లా అదనపు 7వ న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ దేవత దర్శనంకోసం వచ్చిన చంద్రమౌళీశ్వరికి ఆలయ మర్యాదలతో నిర్వాహకులు స్వాగతం పలికారు.


పాలతోడులో బాపనమ్మ వారిని దర్శించుకుంటున్న పెద్దాపురం 7వ అదనపు న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం


ముమ్మిడివర్పాడులో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ముగింపును పురస్కరించుకుని అమ్మవారి గ్రామోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముమ్మిడివర్పాడులో అమ్మవారి విగ్రహాన్ని పురవీధులలో మేళతాళ మంగళవాయిద్యాలు, బాణాసంచాకాల్పుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలమూరును తూర్పులో కలపండి

● నాయకులు, అధికారులకు వినతి

ఆలమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అన్ని విధాలుగా ఆలమూరు తూర్పుగోదావరిలో ఉండటం అనువైనదని అందువలన ఆలమూ రు ప్రజల ఆవేదనను అర్థం చేసుకోండని ఆలమూరు జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. జిల్లాల మా ర్పులకోసం జరుగుతున్న సమీకరణలలో ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి కేంద్రమైన రాజమహేంద్రవరంనకు దగ్గరలో ఉండటంవల్ల ఈ మండలాన్ని తూర్పులో విలీనం చేయాలని వారు కోరారు. ఆలమూరు మండలం జొన్నాడలో ఆదివారం ఆలమూరును తూర్పులో విలీనం చేయాలనే నినాదంతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రసంగించారు. ఆలమూరు వాదనను గుర్తించండని వా రు కోరారు. ఆలమూరు జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. జేఏసీ ద్వారా కార్యాచరణ ప్రకటించి ఆమేరకు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు అందించి తదుపరి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పలువురు సూచించారు. ఈకార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు హాజరయ్యారు.


ఆలమూరు మండలం జొన్నాడలో జరిగిన జేఏసీ సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ


సోమేశ్వరంలో బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్‌లో ఈనెల 8న బాణసంచా పేలుడు కారణంగా మృతి చెందిన పాకా అరుణ, వాసంశెట్టి వెంకటలక్ష్మి కుటుంబాలను ఆదివారం పలువురు బీజేపీ నాయకులు పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ బీజేపీ నాయకులతో కలిసి సోమేశ్వరంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకి రాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి, మండపేట నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరాం, బీజేపీ మండలాధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చికురుమల్లి వెంకటేశ్వరరావు, చిరట్ల సు బ్బారావు, నరాల రాంబాబు ఉన్నారు.

టీడీపీ నాయకుల పరామర్శ


మృతుల కుటుంబాన్ని తెలుగుదేశంపార్టీ అమలాపురంపార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస పరామర్శించారు. రాయవరంలో ఇటువంటి ప్రమాదం చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు.

గోపాలపురంలో పల్లకీ సేవ

రావులపాలెం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మాండకోపనిషత్ గ్రంథాన్ని మానవాళి అందరికీ అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ట్రూత్ వివేకామృత సంస్థ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు శ్రీ వివేకానంద పిలుపు మేరకు మాండకోపనిషత్ పల్లకిసేవ ఊరేగింపు కార్యక్రమాన్ని గోపాలపురంలో నిర్వహించారు. మంగళవాయిద్యాలతో ఓంకార నాదాన్ని స్మరిస్తూ నల్లమిల్లి అమరజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు.


గోపాలపురంలో ఓంకార నినాదంతో పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్నకు తెలంగాణ హైకోర్టు జడ్జి పూజలు


తెలంగాణ హైకోర్టు జడ్జి దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న డీసీ చక్రధరరావు

ఆత్రేయపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తెలంగాణా హైకోర్టు జడ్జి టి.మాధవిదేవి దంపతులు స్వామివారిని దర్శించుకున్నా రు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వేద ఆశీర్వచనం అందుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో చక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు. మచిలీపట్నం జిల్లా జడ్జి పి.పాండురంగాదేవి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ప్రశాంతంగా వీఏ రాత పరీక్ష

యానాం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న విలేజ్ అసిస్టెంట్, ఎంటీఎస్ పోస్టులకు సంబంధించి పుదుచ్చేరి వ్యాప్తంగా ఆదివారం జరిగిన రాతపరీక్ష ముగిసింది. యానాంకు సంబంధించి 7 పరీక్షాకేంద్రాలలో 1917 మందికిగాను 1284మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పుదుచ్చేరి నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి ఇషీతారాతీ, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ పరిశీలించారు.